విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 23, జనవరి 2025

నేడు మంత్రి కోవెలకుంట్లకు రాక

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్లు భవనాల పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కోవెలకుంట్లకు వస్తున్నట్లు తాసిల్దార్ పవన్ కుమార్ రెడ్డి, ఈ ఓఆర్డి ప్రకాష్ నాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు ప్రధాన రహదారిలోని జమ్మలమడుగు సర్కిల్ నందు ప్రజా సంఘం ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డాక్టర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ,బస్టాండ్ సమీపంలో ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హాజరై విగ్రహ ఆవిష్కరణ ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే బస్టాండ్ సమీపంలో ఖాళీగా ఉన్న స్థలం అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు సిద్ధం చేసి ఉన్న స్థలంలో, జిల్లాలో రెండు ఇండస్ట్రీలు మంజూరు కావడంతో కోవెలకుంట్లలో ఒక ఇండస్ట్రీ ఏర్పాటుకు ఇందిరమ్మ కాలనీలో ఉన్న స్థలము లను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, అధికారులు, పార్టీ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేరాల నియంత్రణలో పోలీసుల పనితీరు అభినందనీయం

- డీజీపీ ద్వారకా తిరుమల రావు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నేరాల నియంత్రణలో జిల్లా పోలీసుల పనితీరు అభినందనీయమని రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ డీజీపీ ద్వారకా తిరుమల రావు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో నేరాల పరిస్థితిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా డీజీపీ ద్వారకా తిరుమలరావు నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయానికి రాగానే కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం జిల్లా సాయుధ బలగాలనుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సమీక్షా సమావేశంలో ముందుగా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా నంద్యాల జిల్లాలో నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యల గురించి డీజీపీకి వివరించారు. ఈ సంధర్భంగా డీజీపీ మాట్లాడుతూ వివిధ రకాల నేరాల నియంత్రణలో పోలీసు అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని, నేరాల నియంత్రణలో పోలీసు అదికారులు వారి సిబ్బంది కృషి అభినందనీయమని ప్రశంసించారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా నేరాల సంఖ్య తగ్గిందన్నారు. ప్రస్తుతం నేరాలు అదుపులో ఉన్నాయన్నారు. ముఖ్యంగా పోలీస్ అధికారులు, సిబ్బంది సైబర్ నేరాలు, ముఖ్యమైన కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని, నేరాల నియంత్రణకు ఎప్పటికప్పుడు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. నిబద్ధతగా పనిచేసి జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించాలని ఆదేశించారు.జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ఆసాంఘిక శక్తులను అడ్డుకునేందుకు టెక్నాలజీని ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో డ్రోన్స్, సీసీ కెమెరాలు వాడుతున్నామన్నారు. నేరాలు జరిగే ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వలన నేరస్తులను కనుగొనడం జరుగుతుందని, జిల్లాలో ఫింగర్ ప్రింట్ యూనిట్ బలోపేతం చేయడం ద్వారా వివిధ రకాల కేసులలో నేరస్తులను కనుగొని కేసులను ఛేదించడం జరిగిందని తెలిపారు. క్రైమ్ డిటెక్షన్ లో సిసి ఫుటేజ్ ఆధారాలు చాలా కీలకపాత్ర పోషిస్తాయని, వీటి కోసం రాష్ట్రంలో 18 వేల సిసి కేమరాలను ఏర్పాటు చేశామన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా లక్ష కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, నంద్యాల ఎస్డిపిఓ మంద జావళి ఆల్ఫోన్స్, డీఎస్పీలు రవికుమార్, శ్రీనివాస్ జిల్లా ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

సామూహిక మరుగుదొడ్డి స్థలం ఆక్రమణ

నిర్మాణం చేపట్టిన ఆక్రమణదారుడు
విన్నవించిన చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : ఆక్రమణకు కాదేది అనర్హం అన్నట్లు కబ్జాదారులు మండలంలో రెచ్చిపోతున్నారు. ఖాళీ ప్రభుత్వ స్థలాలు కనపడితే గద్దల వాలిపోతున్నారు. కడకు కొందరు స్మశానాలు, మరుగుదొడ్ల స్థలాలను కూడా వదిలి పెట్టడం లేదు. మండలంలోని ఎర్రగుడి గ్రామంలో బహిరంగ సామూహిక మరుగుదొడ్డి స్థలము ఆక్రమణకు గురైంది. ఆక్రమణదారుడు ఏకంగా మినీ గోకుల నిర్మాణాన్ని చేపట్టాడు. ఇదేమని అడిగిన వారికి ఇతరుల నుండి కొను గోలు చేసినట్లు ఆక్రమణదారుడు చెబుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. తరాలుగా గ్రామంలోని మహిళలు మరుగు దొడ్డిని వినియోగిస్తున్నారు. దాదాపు 40 సంవత్సరాల కిందట అప్పటి గ్రామ సర్పంచ్ గా పనిచేసిన పుల్లయ్య గ్రామంలో మూడు మహిళల కోసం సామూహిక బహిరంగ మరుగుదొడ్లను ప్రభుత్వం నిధులతో నిర్మించినట్లు గ్రామ స్తులు తెలిపారు. వాటిలోఇప్పటికే ఎస్సీ కాలనీవాసులకు సంబంధించి ఒకటి ఆక్రమణకు గురైందని, ఇప్పుడు ఓసి, బీసీ మహిళలు ఉపయోగించే మరో మరుగుదొడ్డి స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టడం గమనర్హం. గ్రామానికి చెందిన వ్యక్తి ప్రభుత్వానికి చెందిన మరుగుదొడ్డి స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులకు గ్రామస్తులు వారం రోజుల కిందట ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. నిర్మాణం వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రీడాకారునికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - బనగానపల్లె : రాష్ట్ర స్థాయి క్రీడాకారునికి ఆర్థిక సాయం అందించిన బీసీ ఇందిరారెడ్డి మండల పరిధిలోని హుసేనా పురం గ్రామానికి చెందిన జగదీష్ ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జనవరి 27 తేదీ నుండి 31 తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి సీనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ఎంపికైనాడు. స్థానిక టిడిపి కార్యాలయంలో జగదీష్ మంత్రి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా బిసి ఇందిరా రెడ్డి జాతీయస్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పేర్కొంటూ విద్యార్థికి ఆర్థిక సాయం చేశారు.

దివ్యాంగ విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర - వెలుగోడు : పుట్టినరోజు నాడు వేడుకలు చేసుకోవడం కన్నా, ప్రజా సేవ చేయడము తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, సీనియర్ జర్నలిస్ట్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ రఘు రాముడు యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని క్రాంతి దివ్యాంగుల పాఠశాల నందు తన 60వ పుట్టినరోజు వేడుకలను దివ్యాంగ విద్యార్థుల మధ్య జరుపుకున్నారు. ప్రతి ఒక్కరూ తనకు చేతనైన సేవ చేయడం అలవర్చుకోవాలని రఘు రాముడు అన్నారు. ఈ సందర్భంగా లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.ఎఫ్ ఇమ్మానియేల్ రఘురాముడును పూలమాల శాలువాతో సత్కరించారు. 30సంవత్సరాలు జర్నలిస్టుగా, బీసీ సంఘం నాయకు డుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, తన వార్తల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడంలో సఫలీకృతులయ్యారని అన్నారు. పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్రాంతి దివ్యాంగుల పాఠశాల కార్యదర్శి జాకీర్ హుస్సేన్, యాదవ సంఘం నాయకుడు నాగేశ్వరావు యాదవ్, విలేకరులు రాఘవేంద్ర, చంద్రశేఖర్, షాబీర్ హుస్సేన్ నాజీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులకు ఆహ్వానం

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఆసక్తి గల అర్హులైన బీసీ కులాల వారినుండి కార్పొరేషన్ ద్వారా రుణాలు లబ్ది పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ శివ మల్లేశ్వరప్ప పేర్కొన్నారు. బీసీఎ,బిసిబి బిసిడి బీసీఇ ఓసిఇ వర్గాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకం కింద బ్యాంకు లింకు స్కీం ద్వారా రుణాల కొరకు లబ్ధిదారులు ఓబి ఎంఎంఎస్, యాప్‌లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి అర్హత 21 నుంచి 60 సంవత్సరాల లోపు వారు దారిద్ర రేఖకు దిగువన ఉండి తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. రుణాలు 1స్లాబ్ కింద రూ 2.లక్షలు స్లాప్, 2 కింద రూ.3 లక్షలు, స్లాబ్ 3 కింద రూ.5 లక్షలలోపు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు. ఎర్రగుంట్ల ఎస్బిఐ యాల్లూరు కెనరా బ్యాంక్ ,గోవింద పల్లె కెనరా బ్యాంక్ గాజుల పల్లె ఏపీజీబీ సిరివెళ్ల తదితర బ్యాంకుల పరిధిలో మొత్తం 55 యూనిట్లు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప స్పష్టం చేశారు.

ఆళ్లగడ్డ డీఎస్పీగా కొలికపూడి ప్రమోద్

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ నూతన డీఎస్పీగా కొలికపూడి ప్రమోద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపా లపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడకుండా పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి ప్రమోద్ ను ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం, పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి సంపద కేంద్రాలన్నీ వినియోగంలోకి రావాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : గ్రామాల్లోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలన్నీ వినియోగంలో వచ్చేలా చూడాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ తెలియజేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో చెత్త నుండి సంపద కేంద్రాలు పూర్తిస్థాయిలో పని చేసేలా చేయాలన్నారు. గ్రామా పంచాయతీలను ఓడీఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమలో ఈవోపీఆర్డి తాహీర్ హుసేన్ అర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య పాల్గొన్నారు.

కోడిపందెం ఆడుతున్న వారిపై కేసు నమోదు

రూ.43,400 నగదు ,10, మోటార్ సైకిల్లు ,2 పందెం కోళ్ళుస్వాధీనం

విశాలాంధ్ర-రుద్రవరం : మండలంలోని హరినగరం గ్రామ సమీపంలో కోడిపందెం ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల మేరకు హరి నగరం సమీపంలో కోడిపందాలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. ఇందులో భాగంగా రుద్రవరం, గోవిందపల్లి, ఆళ్లగడ్డ, బాచేపల్లి, రామచంద్ర పురం, సుద్దపల్లి గ్రామాలకు చెందిన 11 మంది కోడిపందాలు ఆడుతుండగా వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ 43400 నగదు ,10 మోటార్ సైకిళ్ళు ,2 పందెం కోళ్లను స్వాధీనం చేసుకొని వీరందరిపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

దోమలు బాబోయ్.. దోమలు

చీకటి పడితే చాలు దోమల బెడద
హడలిపోతున్న గ్రామస్తులు..

విశాలాంధ్ర - రుద్రవరం : ఏకాలానికి ఆ కాలపు పనులు అన్న పెద్దల మాటకు విరుద్ధంగా నేడు సమాజంలో జరుగుతుంది. నాటి చలికాలంలో దోమ తన రెక్కలను పోగొట్టుకొని మరణించడం అందరికీ తెలిసిన విషయమే. ఎండాకాలంలో అయితే వేడి దాటికి దోమ ఉండదనె విషయం అందరికీ తెలిసినదే. వీటికి విరుద్ధంగా ప్రకృతి వైపరీత్యమో, వాతావరణంలో తేడో మనకు తెలియదు గాని ప్రజలను ఎండాకాలం,వానాకాలం, చలికాలం ఏ కాలాలలో నైనా మిమ్ములను వదలమన్నట్లు దోమలు ప్రజలను పీక్కుతింటున్నాయి. రుద్రవరం మండలం కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో అన్ని గ్రామాల ప్రజలను దోమలు పీల్చేస్తున్నాయి. చీకటి పడితే చాలు హడలి పోవాల్సిందే నని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలోని అంతర్గత వీధుల పరిస్థితి దేవుడెరుగు కనీసం గ్రామంలోని ప్రధాన రహదారులలో కూడా దోమలు పీకేస్తున్నాయి. పగలుపూట బడులు ,గుడులు ప్రభుత్వ అధికారుల కార్యాలయంలోని అధికారులను వదలకుండా పీకేస్తున్నాయంటున్నారు అధికారులు. ఇలాగే కోట్లాది దోమలు రోజు రోజుకు వృద్ధి చెందుతూ గ్రామ ప్రజలను పీకేస్తూ ప్రజలు విష జ్వరాలకు గురి రాకముందే అధికారులు అప్రమత్తమై ప్రజలు దోమల భారీన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వలసలు నివారించకపోతే ఉద్యమం

విశాలాంధ్ర-డోన్ : వలసలు నివారించి ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డోన్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటేశ్వర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.నారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉపాధి లేక సుదూర ప్రాంతాల వలస వెళుతున్నారన్నారు. హైదరాబాద్, బెంగళూరు, గుంటూరు మహా నగరాలకు వలస వెళుతున్నారని, దీంతో వారి చదువుకుంటున్న పిల్లలను వెంటబెట్టుకుని పోతున్నారని, పిల్లలు చదువులకు దూరం అవుతున్నారని వారన్నారు. అక్కడ నివాస సౌకర్యాలు లేక, తిండికి, నిద్రకు, సౌకర్యం లేక ఈగల దోమల భారీ పడి విలవిలలాడుతున్నారు. కావున గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు తక్షణమే పనులు ప్రారంభించాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని రాజకీయ జోక్యాన్ని నియంత్రించాలన్నారు. పని చేసే కూలీ లకుడబ్బులు గిట్టుబాటు అయ్యేటట్లు చూడాలన్నారు. వలసలు వెళుతున్న వారికి గిట్టుబాటు అయిన పనులు చూపించి రోజుకు 600 ఇవ్వాలని, పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రెండు పూటల పని విధానాన్ని ఎత్తివేయాలని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని అన్నారు. అదేవిధంగా పనుల తోడుగా పోషణకు పెండింగ్లో ఉన్న బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని, పండ్ల తోట రైతులు సకాలంలో బిల్లులు పడక ఆఫీసులో కాలు అరిగేటట్లు తిరుగుతున్నారని వారన్నారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఉపాధిహామీ పథకం అధికారులు గ్రామాల్లో తిరిగి వలసలు నివారించి ఉపాధి హామీ పథకం పనులను కల్పించే ఆదుకోవాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వరదరాజులు, సీపీఐ దొరపల్లె శాఖ కార్యదర్శి కొండయ్య, మల్లెంపల్లి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమి పూజ : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణాలు, గ్రామాలలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలోని 37 వార్డు నందమూరినగర్, వైయస్సార్ నగర్ లో నూతనంగా నిర్మించబోయే సీసీ రోడ్లను, డ్రైనేజీలను టెంకాయ కొట్టి ప్రారంభించారు. అక్కడ ఉన్న ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో పట్టణాలలోగాని గ్రామాలలో గాని అభివృద్ధి అన్నది కనిపించలేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాకనే పట్టణాలకు, గ్రామాలకు మహర్దశ వచ్చిందని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొస్తామని మంత్రి ఫరూక్ తెలిపారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీపడేదే లేదని నాణ్యతమైన నిర్మాణం జరగాలని కాంట్రాక్టర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, మున్సిపల్ చైర్పర్సన్ మాబునిసా, దేరెడ్డి శివనాగిరెడ్డి, తాటికొండ బుగ్గ రాముడు, తాటికొండ మహేష్, మరాఠీ సూరి, బాబురావు, కౌన్సిలర్లు కండే శ్యామ్ సుందర్ లాల్, నాగార్జున, జైనాబి, శ్రీదేవి, మహబూబ్ వలి, మామిడి నాగరాజు కుమార్, మాజీ కౌన్సిలర్ మామిడి ఉషారాణి, మాజీ కౌన్సిలర్ మిద్దె హుసేని, మునిసిపల్ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రతి గృహానికి రెండు డస్ట్ బిన్‌లు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని గృహ యజమానులు సకాలంలో ఇంటి పన్ను లు చెల్లించాలని శిరివెళ్ల మేజర్ పంచాయతీ ఈవో అశ్విని కుమార్ పిలుపునిచ్చారు. ఇంటి పన్ను చెల్లించిన ప్రతి ఒక్కరికి రెండు డస్ట్ పిన్ డబ్బాలు అందించడం జరుగుతుందని తెలియజేశారు. మండల కేంద్రంలో నాలుగు వేలకు పైగా హౌస్ టాక్స్ హెూల్డర్లు ఉన్నారని ఇన్టీపన్ను చెల్లించిన ప్రతి ఒక్కరికి రెండు చెత్తబుట్టలు అందించి పరిస రాల పరిశుభ్రతకు సహకరించాలని సూచిస్తున్నట్లు ఆయన పేర్కొ న్నారు. ఇంట్లో వాడిపడేసిన చెత్తాచెదారం వ్యర్థ పదార్థాలు చెత్త బుట్టల ద్వారా తీసుకువెళ్లి గ్రామపంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు గాని సూచించిన డంప్ తొట్లల్లో గాని పారిశుద్ధ్య కార్మికులకు గాని అందించి స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి సహకరించాలని ఈవో అశ్విని కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ లక్కాకుల సాలమ్మ చంద్ర, గ్రామపంచాయతీ సిబ్బంది హౌస్ టాక్స్ హెూల్డర్లు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-అవుకు : మండలంలోని పాడి పరిశ్రమ రైతులు పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ అరుణ్ కుమార్ నాయక్ అన్నారు. పట్టణంలోని పశు వైద్య కేంద్రం వద్ద వైద్యాధికారి డాక్టర్ భారతీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాన్ని అరుణ్ కుమార్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వము పశు ఆరోగ్య శిబిరాలను తీసుకువచ్చిందని అన్నారు. అలాగే పశు సంరక్షణ కోసం గోకులాలను, పశుగ్రాస క్షేత్రాలను తీసుకురావడం జరిగిందని అన్నారు. వైద్యాధికారి డాక్టర్ భారతీదేవి మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువులకు లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కేవలం ఆడదూడలు పుట్టే ఎదసూదులు మాత్రమే వాడాలని వీటి ద్వారా పుట్టే దూడలకు ఎక్కువ పాల ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంటుందని అన్నారు. పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. అనంతరము పశువులకు మరియు దూడలకు నట్టల నివారణ మందులను త్రాపించారు. పాడి రైతులకు క్యాల్షియంను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తిక్కన్న, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి వెంకటరాముడు నాయక్, పశు వైద్య సిబ్బంది రాజేష్, నవీన్,మహేంద్ర, భార్గవి, ఓబులేష్,గణేష్, రవి, మక్బూల్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర - డోన్ : వాహన చోదకులు తప్ప నిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలి డోన్ సబ్ కోర్ట్ న్యాయమూర్తి తంగమని అన్నారు. బుధవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా డోన్ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో డోన్ ఎంఈఓ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో సాయి శ్రీ జూనియర్ కాలేజి, ప్రభుత్వ బాలికల పాఠశాల పిల్లలు, ఉపాధ్యా యులు కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి జడ్జి తంగమని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు భద్రత మనందరి బాధ్యతన్నారు. ప్రతి ఒక్కరు వాహనాన్ని నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యం గా ద్విచక్ర నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ లైసెన్సును పొంది ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని వాహనాన్ని నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డోన్ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సైలు శరత్ కుమార్ రెడ్డి, నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

నిత్య అన్నదానానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : మండల పరిధిలోని గోవిందిన్నె గ్రామ సమీపంలో నిర్మిస్తున్న నిత్యఅన్నదాన ప్రసాద సత్రానికి రిటైర్డ్ అధ్యాపకుడు గని తిమ్మారెడ్డి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని నిత్య అన్నదాన ధర్మకర్త పల్లె నరసింహారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతరులకు సహాయం చేయాలని ఉద్దేశంతో నిర్మిస్తున్న నిత్య అన్నదాన సత్రానికి ఆర్థిక సహాయం చేయడం వారి సామాజిక స్పృహకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె నరసింహారెడ్డి,వల్లంపాడు నారాయణ రెడ్డి,నారాయణస్వామి, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నూతన రైస్ మిల్లులో ప్రమాదం

ఒకరు మృతి... ముగ్గురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - బనగానపల్లె : పట్టణ శివారులోని అవుకు రోడ్డు ఉన్న శ్రీనివాసు రైస్ మిల్‌లో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలు సుదీష్ మృతి చెందగా, మరో ముగ్గురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు .తీవ్రంగా గాయపడిన దశరథ్, బిరందర్ లను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.రైస్ మిల్లులో నూతన బంకర్ నిర్మాణం చేపడుతుండగా యజమాని సరైన రక్షణ పద్ధతులు పాటించకపోవడంతో బంకర్ కూలి పనిచేస్తున్న కూలీలపై పడిపోవటం తో ప్రమాదం సంభవించినట్లుగా తెలుస్తుంది. పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతి దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మానవత్వం చాటుకున్న మంత్రి

విశాలాంధ్ర - పాణ్యం : మండల పరిధిలోని తమ రాజు పల్లె గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై కర్నూలు నుండి నంద్యాల వైపు బైక్‌పై వస్తున్న కొనిదేడు గ్రామానికి చెందిన దంపతులు బైక్ అదుపు తప్పడంతో మహిళ తలకు తీవ్ర రక్తస్రావం కావడంతో హైదరాబాద్ నుండి బనగానపల్లె వైపు వస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి గమనించి మహిళను తన సొంత వాహనంలో పాణ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. మహిళ ఆరోగ్యంపై డాక్టరును అడిగి తెలుసుకుని మెరుగైన చికిత్స నిమిత్తం దగ్గర్లోనే సాయంత్రం ఆస్పత్రికి మహిళను తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి, టౌన్ టీడీపీ నాయకులు ఎంపీటీసీ రంగ రమేష్, లాయర్ బాబు, తిరుపతి రెడ్డి, సుధాకర్ మహిళా ఆరోగ్యంపై ఆరా తీశారు.

వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : పశువులకు సోకే వివిధ రకాల వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని చింతలచెరువు గ్రామంలో వైద్యాధికారి దీపాకుమారి,కేపీ తాండలో పశు వైద్యాధికారి సాయి బాబా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను ఆయన పరిశీలించారు. ఈ సంధర్భంగా పశువులకు గర్భకోశ చికిత్సలు, నట్టల నివారణ మందుల పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు వేసి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వివిఎల్‌ఓలు జమాల్‌వలి, మురళి మోహన్, గోపాలమిత్ర వీరయ్య, ఏహెచ్‌ఏలు రైతులు పాల్గొన్నారు.

క్యాట్ ఒలంపియాడ్ పరీక్షల ఫలితాలలో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు శ్రీ చైతన్య పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆలిండియా ఒలంపియాడ్ (నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్) పరీక్ష నందు ప్రతిభ చాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దీప,డీన్ ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా వారు తెలియజేస్తూ ఒలంపి యాడ్ పరీక్షలో ప్రతిభ చాటిన 70 మంది విద్యార్థుల్లో 8 మంది విద్యార్థులు నగదు, మెరిట్ సర్టిఫికెట్స్ 37 మంది విద్యార్థులు మెడల్స్ సర్టిఫికెట్స్ 25 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్లను అందుకొని శ్రీ చైతన్య పాఠశాల సత్తా చాటారన్నారు. ఒలంపియాడ్ పరీక్ష అనేది విద్యార్థుల ప్రతిభ ప్రపంచ స్థాయిలో శిఖరాలను చేరడంలో సహాయం చేస్తుందన్నారు. అనంతరం శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం సురేష్,ఆర్ఐ కోటయ్య చౌదరి,ప్రిన్సిపాల్ దీప,కోఆర్డినేటర్ రమణయ్య,డీన్ ఉమామహేశ్వర రావు,ఏవో గోపాల్‌రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 23, జనవరి 2025

రూ.291.67 కోట్లతో నగరపాలక అంచనా బడ్జెట్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు నగరపాలక సంస్థ 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనాల బడ్జెట్‌ను బుధవారం స్థాయి సంఘం ఆమోదించింది. నగరపాలక కార్యాలయంలో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన, స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. రూ.291.67 కోట్లతో బడ్జెట్ రూపకల్పన చేశారు. మొత్తం ఆదాయం రూ.363.99 కోట్లు, ఖర్చు రూ.201.22 కోట్లు, రెవెన్యూ ఆదాయం రూ.201.22 కోట్లు, ప్రభుత్వ గ్రాంట్లు రూ.162.77 కోట్లు, మూలధన రాబడి రూ.138.69 కోట్లు, నికర మిగులు రూ.72.31 కోట్లుగా అంచనాలు తయారు చేశారు. రెండు తీర్మానాలకు స్థాయి సంఘం ఆమోదం తెలిపింది. అమృత్-2 పథకంలో భాగంగా 19వ వార్డులోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ పబ్లిక్ పార్కు, 45వ వార్డులోని టీచర్స్ కాలనీ పబ్లిక్ పార్కుల నిర్వహణ బాధ్యతలను పొదుపు సంఘాలకు కేటాయించి, ఏడాది కాలానికి సంబంధించి ఒక్కొక్క పార్కుకు రూ.4.90 లక్షలు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. 200 మంది తాత్కాలిక పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించి గత ఏడాది డిసెంబర్ 17 నుండి ఈ ఏడాది జనవరి 31 నాటికి సంబంధించి, రూ.42.93 లక్షల వేతనాలు చెల్లింపునకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు, సభ్యులు జుబేర్, యూనూస్, క్రాంతి కుమార్, మిద్దె చిట్టమ్మ, అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, అకౌంట్స్ అధికారి చండి ప్రసాద్, ఆరోగ్యధికారి కె.విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓలు జునైద్, ఇశ్రాయేలు, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, ఎగ్జామినర్ సుబ్రమణ్యం, అకౌంట్స్ అధికారులు శబాన, మల్లికార్జున్, క్లర్క్ జీఎం శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడులకు పాల్పడిన ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర - కోడుమూరు : విద్యార్థినీలపై వికృత చేష్టలతో లైంగిక దాడులకు పాల్పడిన ఉపాధ్యాయుడు లక్ష్మన్నను వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్, సీపీఐ (ఎం), ఎమ్మార్పీఎస్ తదితర ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వెంకటగిరి గ్రామం ఎస్సీ కాలనీలోని స్పెషల్ స్కూల్ నందు పని చేస్తున్న ఉపాధ్యాయుడు లక్ష్మన్న బాలికలపై లైంగిక దాడులకు పాల్పడిన సంఘటనపై పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆగ్రహంతో పాఠశాల వద్దకు చేరుకొని దాడికి యత్నించగా, పోలీసులు లక్ష్మన్నను అరెస్టు చేసి తీసుకొచ్చిన సమాచారం తెలుసుకున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగ స్వామి, సీపీఐ(శ్రీం) గఫర్ మియా, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య, జిల్లా నాయకులు నాగేష్ తదితర ప్రజా సంఘాల నాయకులు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని స్థానిక కోట్ల సర్కిల్ వద్ద రోడ్డుపై బైఠాయించి టీచర్ లక్ష్మన్న సస్పెండ్ చేయాలని పెద్దఎత్తున నినాదాలతో డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఎస్ అల్తాఫ్ బాషా, మండల ఉపాధ్యక్షులు వీరాంజనేయులు, మండల నాయకులు పులి, సిద్దు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి - నాగేష్ మాదిగ: కాగా బాలికలపై లైంగిక దాడులకు పాల్పడిన టీచర్ లక్ష్మన్నపై తప్పనిసరిగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మండల అధ్యక్షులు నాగేష్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, కార్యకర్తలు అశోక్, మల్లయ్య, మోషన్న సీఐ తబ్రేజ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

కీచక ఉపాధ్యాయుడు సస్పెండ్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినిలపట్ల లైంగిక వేదింపులకు పాల్పడినట్లు ఆరోపనలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు లక్ష్మన్న సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామెల్ పాల్ తెలిపారు. విద్యార్థులను లైంగికంగా వేదింపులకు గురి చేస్తున్నారని తమ పిల్లలు చెప్పడంతో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయున్ని నిలదీసి, ఉపాధ్యాయున్ని పోలీసులు అదుపులోకి తీసుకొని, విచారణ చేపట్టారు.

మృతుల కుటుంబాలను శ్రీ మఠం అధికారులు ఆదుకోవాలి

విశాలాంధ్ర - మంత్రాలయం: రోడ్డు ప్రమాదంలో మరణించిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని ఏఐవైఎఫ్ తాలూకా కార్యదర్శి ఎం.రాజు ఒక ప్రకటనలో కోరారు. మంత్రాలయం శ్రీ మఠం గురు సార్వభౌమ సంస్కృత పాఠశాలకు చెందిన విద్యార్థులు నరహరి తీర్థుల ఆరాధన ఉత్సవాలకు 14 మంది విద్యార్థులు మంత్రాలయం నుండి హంపికి బయలుదేరడం జరిగిందని, విద్యార్థులు ప్రయాణిస్తున్న తుఫాను వాహనం కర్ణాటకలో బోల్తా పడి డ్రైవర్‌తో పాటు ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందేనన్నారు. మరో ఐదు మందికి తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను, డ్రైవర్ శివ కుటుంబమును శ్రీ మఠం అధికారులు ఆదుకోని కుటుంబ సభ్యులకు అండగా ఉండాలని ఆయన కోరారు. తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని శ్రీ మఠం అధికారులను ఆయన కోరారు. మృతి చెందిన వారికి సంతాపం వ్యక్తం చేశారు.

నైపుణ్యాలను వెలికి తీయండి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో ఉన్న ప్రతిభా పాటవాలను నైపుణ్యాలను వెలికి తీయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. బుధవారం ఉదయం కార్యాలయంలోని ఆయన చాంబర్లో బాలోత్సవం, 2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎక్కువ మంది విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని బాలోత్సవ కమిటీ నిర్వాహకులను సూచించారు. కార్యక్రమంలో బాలోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు డి.ధనుంజయ, జేఎన్ శేషయ్య, కెంగార మోహన్, జె.రంగస్వామి, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

విషాలాంధ్ర - తుగ్గలి: రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి జరిగేది టీడీపీ హయాంలోనే అని ఎమ్మెల్యే శ్యాంబాబు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని హుస్సేనాపురం గ్రామంలో రూ.92 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి హుసేనాపురం గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని, వర్షం వచ్చిందంటే ఆ గ్రామం నుండి ప్రజలు బయటకు రావాలంటే వరద నీళ్లలో వచ్చేవారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే రూ 45 లక్షలతో బ్రిడ్జి నిర్మించడం, రూ.47 లక్షలతో బీటీ రోడ్డు, సీసీ రోడ్డు వేయించడం జరిగిందన్నారు. కాంట్రాక్టర్ దశరథ రామిరెడ్డి, పంచాయతీరాజ్ మండల ఇంజనీరు వెంకటేశ్వర్లు, ఏపీవో హేమ సుందర్, సర్పంచ్ సలహాదారుడు సుల్తాన్, శాలివాహన ఫెడరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట రాముడు, మైనింగ్ మాజీ డైరెక్టర్ తిమ్మయ్య చౌదరి, మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేశు, ఎస్టీ సెల్ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటపతి, మాజీ సర్పంచ్ పకీరప్ప, టీడీపీ నాయకులు సత్య ప్రకాష్, కోటేష్ గౌడ్, ఏకాంత, సీపీఐ నాయకులు రోళ్లపాడు వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

కంపెనీ యజమానులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - వెల్దుర్తి: మండల కేంద్రంలోని హైవే సమీపంలో చెరుకులపాడు క్రాస్ రోడ్డు రామళ్లకోట రోడ్డు బ్రహ్మగుండం క్రాస్ రోడ్ దగ్గర అలవెన్స్ ఐటీసీ పొగాకు గోడౌన్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్నారు. లాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న గోడౌన్లను జిల్లా అధికారులు స్పందించి తగిన చర్య తీసుకోవాలని సీపీఐ కృష్ణ డిమాండ్ చేశారు. అనంతరం బుధవారం పొగాకు గోడలను పరిశీలించారు. ఈ సందర్భంగా టి.కృష్ణ మాట్లాడుతూరైతులకు తీవ్ర అన్యాయం చేస్తుందని పొగాకు కంపెనీ యజమానులపై ఒక్క బెల్‌కు పొగాకు సాగు చేస్తే మంచి ధర ఇస్తామని కంపెనీలు నమ్మించాయి. రైతులకు అవగాహన కల్పించకుండగా నమ్మించి మండలంలో చాలా చోట్ల పొగాకు పంటలను వేయించారన్నారు. వాతావరణ పరిస్థితులను తట్టుకొని రైతులు పంటనుకాపాడారని, కొనుగోలుకు వెళ్తే కొర్రీలు పెడుతున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు శేషు, సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి చిలిపి కృష్ణ, పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు, నాయకులు శివుడు, బజారప్ప, పాల్గొన్నారు.

కిశోరి వికాసం.. బంగారు భవిష్యత్తుకు పునాది

విశాలాంధ్ర-గూడూరు: కిశోరి వికాసం కార్యక్రమంతో బాలికలకు బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఎంపీడీవో శివ నాగ ప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జరీనాభాను అధ్యక్షతన నిర్వహించిన కిశోరి వికాసం అవగాహన కార్యక్రమానికి ఎంపీడీవో శివ నాగ ప్రసాద్, ఏసీడీపీఓ నరసమ్మ, మండల విద్యాధికారిని సునీలమ్మ, వైద్యులు కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కిశోరి వికాసం పున ప్రారంభంతో రాష్ట్రంలో ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగు పరచడానికి ఓ మంచి అవకాశం అన్నారు. 11 నుండి 18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్య భద్రత, ఆర్థిక స్వాలంబన మెరుగుపరచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ నరసింహులు, అంగనవాడి కార్యకర్తలు, మండల సమైక్య సంఘాలు, గ్రామ సమైక్య సంఘాల సభ్యులు, సచివాలయం పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్ మర్మతులను చేపడుతాం

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు, ఎరుకల చెరువు ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టళ్లకు రూ.1.20 కోట్లకు నిధులు మంజూరైనాయి. హాస్టల్ మర్మతులను త్వరలోనే చేపడుతామని ఆర్డబ్ల్యూఎస్ఎస్ ఈఈ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉన్న ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్ల నుండి హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్ నిధులు మంజూరు చేసిందన్నారు. కంబాలపాడు హాస్టల్‌కు 92 లక్షల 33వేలు, ఎరుకలచెరువు హాస్టల్ కు 37 లక్షల 60వేలు నిధులు వచ్చాయన్నారు. ఇందుకు సంబంధించి టెండర్లు జరిగాయని ఆయన తెలిపారు. త్వరలోనే మరమ్మత్తుల నిర్మాణం పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఆర్డబ్ల్యూఎస్ డీఈ మహబూబ్ ఖాన్, ఏఈ హరినాథ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వనిత, మంజుల, వార్డెన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - కౌతాళం: కౌలు రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, పట్టు, బ్యాంక్, మార్కెటింగ్, తదితర సంస్థల అధికారులతో ప్రభుత్వం చర్చించి, ప్రతి గ్రామంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని బుధవారం కౌతాళంలో జరిగిన సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాదాయ, ధర్మదాయ మరియు వాగ్ బోర్డ్, సంబంధించిన సుమారు నాలుగు లక్షల ఎకరాలకు పైగా సాగు భూమి ఉందని, తరతరాలుగా ఈ భూమిని పేద రైతులు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు వీరికి గుర్తింపు కార్డులు, రైతు భరోసా, పంట రుణాలు, పెట్టుబడి రాయితీ, పంటల బీమా పరిహారాలు అంతంత మాత్రంగానే అందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌతాళం సీపీఐ కార్యదర్శి ఈరన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను పరిశీలించిన సబ్ కలెక్టర్

విశాలాంధ్ర - నందవరం: మండల పరిధిలోని నది కైరవాడి గ్రామంలో రీసర్వే పైలెట్ ప్రాజెక్టు పనులను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరిలించారు. గ్రామంలోని పర్యటించి సచివాలయంలో రీసర్వేకు సంబంధించిన అంశాలపై రెవెన్యూ, సర్వే అధికారులతో చర్చించారు. అనంతరం క్షేత్రస్థాయిలో జరుగుచున్న రీసర్వే ప్రక్రియను తనిఖీ చేసి, ప్రాజెక్టు విషయాలపై సిబ్బందిని అడిగి సమాచారన్ని తెలుసుకొని అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏ రైతుకి ఇబ్బంది రాకుండా రైతు సమక్షంలోనే రీసర్వే పనులు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.శ్రీనివాసులు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, రీసర్వే ఉప తహశీల్దారు మహేష్, మండల సర్వేయర్ అక్బర్ బాష, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వలసలు వెళ్లొద్దు..

విశాలాంధ్ర- హొళగుంద: ప్రజలు ఎవరువలసలు వెళ్ళొద్దని ప్రభుత్వం ఉపాధి హామీ పనులు కల్పిస్తుందని, విద్యార్థులకు సైతం సీజనల్ ఏర్పాటు చేయడం జరిగిందని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీఆర్పీలు లక్ష్మప్ప, తుకారం, రేణుకలు కోరారు. బుధవారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా హెన్నూరు క్యాంపులో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలసలు వెళ్లడం వల్ల అనేక రోగాల బారిన పడి కుటుంబాల చిన్నబిన్నమవుతాయన్నారు. పిల్లల భవిష్యత్ నాశనం అవుతుందని, విద్యకు దూరమవుతారని గుర్తు చేశారు. మండల కేంద్రమైన హెళగుందలో సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి ఏడాది వలసలు నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఉపాధి హామీ పనులలో ప్రతి ఒక్కరికి పనికి తగిన వేతనం దొరుకుతుందని, బొంబాయి హైదరాబాద్, బెంగళూరు సుదూర ప్రాంతాలలో వలసలు వెళ్లి అధిక ఖర్చులతో వ్యయ ప్రయాసలు పడటం కంటే గ్రామంలోని ఉపాధి హామీ పనులను, సీజనల్ హాస్టల్స్‌ను ఉపయోగించుకోవాలని కోరారు.

విశాలాంధ్ర - పెద్దకడబూరు: వలసలు వెళ్లొద్దని - బడి ముద్దు అంటూ ఉపాధ్యాయులు నర్సింహులు, కేశన్న, గోపాల్ బుధవారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణంలో వలసల నివారణపై కూలీలకు అవగాహన కల్పించారు. దండోరా, మైకుల ద్వారా గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఉన్న ఊరిలోనే ఉపాధి పనులకు వెళుతూ పిల్లలను బడికి పంపాలని కోరారు.

కైరిప్పల ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్‌పై దాడి..

విశాలాంధ్ర- ఆస్పరి: మండల పరిధిలోనే కైరుప్పల గ్రామంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్‌పై అదే గ్రామానికి చెందిన వడ్డే మహేష్ బుధవారం దాడికి పాల్పడ్డాడు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చిన్నహెోతూరు, పుటకలమర్రి, అట్టేకల్లు, ములుగుందం, కైరిప్పల, బనవనూరు గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని గత కొంతకాలంగా అధికార పార్టీ నాయకులు ఉపాధి హామీ పథకం ఏపీవో రామకృష్ణ పై ఒత్తిడి తీసుకురావడం జరిగింది. ఈ విషయంపై పలుమార్లు ఉపాధి అధికారులతో ఎలాంటి కారణాలు లేకుండా తమను ఎలా తొలగిస్తారని వాగ్విద్వాదం చేయడం జరిగింది. ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా విషయం శ్రుతి మించి పోవడంతో మండలంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు కొందరం కలిసి హైకోర్టులో స్టే వేయడం జరిగింది. తమ ఉద్యోగాల భద్రతకై హైకోర్టు వారు స్టే విధించడం జరిగిందని తెలిపారు. హైకోర్టు ఇచ్చిన స్టే విధించిన కాపీలను బుధవారం ఉపాధి హామీ పథకం ఏపీఓ రామకృష్ణకు ఇవ్వడం జరిగిందన్నారు. దీన్ని జీర్ణించుకోలేని కైరెప్పల గ్రామంలోని వడ్డే మహేష్ హామీ పథకం కార్యాలయం ముందే నానా మాటలతో తనను దూషించి, తనపై దాడికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ విషయమై సీఐ మస్తాన్ వలిని కలసి మాట్లాడి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పై దాడి దారుణం..

విశాలాంధ్ర -ఆస్పరి: మండల పరిధిలోని కైరిప్పల గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్ పై దాడికి పాల్పడటం దారుణమని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు తొలగించాలని, బలవంతంగా రాజీనామాలు చేయాలని అధికార పార్టీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతూ దౌర్జన్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు మంజునాథ, అశోక్, కుమార్, నరేష్, రాముడు, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కోసిగి : ఏఐఎస్ఎఫ్ 2025 నూతన క్యాలెండర్ ఎస్సై చంద్రమోహన్ ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి ఆవిష్కరణ చేశారు. బుధవారం కోసిగి మండలం పోలీస్ స్టేషన్ నందు, గవర్నమెంట్ జూనియర్ కళాశాల నందు ఏఐఎస్ఎఫ్ క్యాలెండర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్సై చంద్రమోహన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులకు అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సాంబశివుడు, ఉదయ్ భార్గవ్, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శి అంజి, విజయ్, మండల నాయకులు, భాస్కర్, బడేసాబ్, దివాకర్, అభి, అశోక్, అల్లం బాష పాల్గొన్నారు.

విశాలాంధ్ర - దేవనకొండ: బుధవారం స్థానిక మండల మానవ వనరుల కేంద్రం నందు మండల విద్యాశాఖ అధికారి తిమ్మారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టిలు, ఏఐ ఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్ ఏఐఎస్ఎఫ్ 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి భాస్కర్, కోశాధికారి సురేంద్ర, నాయకులు భరత్, బాలరాజు, మురళి, శంకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెంచర్లలో గ్రామ పంచాయితీకి కేటాయించాలి

విశాలాంధ్ర - ఓర్వకల్లు : ఓర్వకల్లు మండల పరిధిలోని గ్రామాలలో రియల్టర్‌లు వేసే వెంచర్లలో గ్రామ పంచాయతీకి 10శాతం స్థలాన్ని కేటాయించాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి సుధాకర్‌లు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో ఎంపీడీవో ఆఫీస్‌లో ఏవో రమణయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఓర్వకల్లు పారిశ్రామిక హబ్బుగా ఏర్పడి, అనేక పరిశ్రమలు ఏర్పడిన తరుణంలో ఓర్వకల్లు మండలంలో రోజురోజుకు రంగుల రంగుల కరపత్రాల రూపంలో అనేక వెంచర్లు ఏర్పడుతూ ఉన్నాయని తెలిపారు. ఈ వెంచర్లలో సామాన్య ప్రజలు, మధ్యతరగతి ప్రజలు వేల, లక్షల రూపాయలు పెట్టి ఇంటి స్థలాన్ని కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ వెంచర్ల లో గ్రామ పంచాయతీ సంబంధించి తీర్మానాలు చేయకుండా, విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నారన్నారు. గ్రామపంచాయతీకి సంబంధించి 10శాతం స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోల్మన్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న రాయల చెరువు యాజమాన్యం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నతుంబలం గ్రామంలోని రాయల చెరువులో యదేచ్ఛగా క్యాట్ ఫిష్ పెంపకం జరుగుతుందని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. వీటికి ఆహారంగా చనిపోయిన కుక్కలను, మేకలను, గొర్రెలను, కుళ్లిన మాంసాన్ని వేస్తున్నార న్నారు. క్యాట్ ఫిష్‌ను తింటే క్యాన్సర్, ఇతర కొత్త రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తు న్నారు. క్యాట్ ఫిష్ పెంపకం తెలుగు రాష్ట్రాల్లో నిషేదం ఉన్నా చిన్నతుంబలం రాయలచెరువు యాజమాన్యం మాత్రం ఏ మాత్రం పట్టించుకోకుండా యదేచ్ఛగా సాగు చేస్తున్నారని, గ్రామస్తులు ఈ విషయంపై మత్స్యశాఖ అధికారులకు విన్నవించినా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

జిల్లాలో పోలీసుల కృషి, పనితీరు అభినందనీయం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్ ఉండాలని, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలను అరికట్టాలని కర్నూలు జిల్లా పోలీసు యంత్రాంగానికి సూచించడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమల రావు తెలిపారు.బుధవారం ఉదయం డీజీపీ ద్వారకా తిరుమలరావు కర్నూలుకు వచ్చారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియం దగ్గర పోలీసుల నుండి గౌరవందనం స్వీకరించారు. అనంతరం వ్యాస్ ఆడిటోరియం ఎదుట మొక్కలను నాటారు. చిన్న పిల్లలు, మహిళల పై జరిగే లైంగిక నేరాలను అరికట్టాలన్నారు. సీఐలకు డిఎస్పీలుగా త్వరలో పదోన్నతులు కల్పిస్తామని తెలిపారు. అనంతరం డీజీపీని కర్నూలు రేంజ్ డీఐజీ, కర్నూలు జిల్లా ఎస్పీలు శాలువతో సన్మానించి, నటరాజ విగ్రహ జ్ఞాపికను అందజేశారు. అనంతరం డీజీపీ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎఎస్పీ ట్రైనీగా కర్నూలు జిల్లాలో పని చేశానన్నారు. జిల్లా పోలీసుల పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు. కర్నూలు ఎస్పీగా పని చేస్తున్న జి.బిందు మాధవ్ కాకినాడకు బదిలీ కావడం జరిగిందన్నారు. కొత్తగా జరుగుతున్న నేరాల పట్ల, క్రైమ్ రివ్యూ విషయంలో టెక్నాలజీ వాడుకోవాలనే విషయాలను కేసులు త్వరితగతిన పురోగతి సాధించాలని జిల్లా పోలీసు అధికారులకు తెలిపారు. కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ క్రోయ ప్రవీణ్, కర్నూలు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, హెూంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ ఎం. మహేష్ కుమార్ ఉన్నారు.

ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పత్తికొండ: ప్రభుత్వ విద్య బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సూచించారు. బుధవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులను కల్పించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థుల బంగారు భవిష్యత్తును ఉన్నత లక్ష్యాల వైపు వెళ్ళే విధంగా తీర్చిదిద్దాలన్నారు. జనవరి 1వ తేదీన తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన అధికారులు, పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు తీసుకువచ్చిన బహుమతి నోటు పుస్తకాలు, పెన్నులను జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి చదువుతున్న 700 మంది విద్యార్థినీలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

VASTU HOUSING FINANCE
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్
యూనిట్ 203 & 204, 2 వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. మహారాష్ట్ర.
సిఐఎన్ నం. : యు65922ఎంహెచ్2005పిఎల్‌సి272501

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్టు చట్టం -2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు-2002 నిబంధన 9తో చదివే సెక్షన్ 13(12) కింద అతనికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అధీకృత అధికారిగా ఈ దిగువ సంతకందారు ఈ కింద పేర్కొన్న రుణగ్రహీతలకు సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా సంబంధిత నోటీసులో పేర్కొన్న బకాయిలను తిరిగి చెల్లించవలసిందిగా ఈ కింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. రుణగ్రహీతలు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పైన పేర్కొన్న చట్ట నిబంధనల్లో నిబంధనల 9తో చదివే సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు ఈ కింద వివరించిన షెడ్యూల్ ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని,ఈ ఆస్తితో ఏ ఒప్పందాలైనా ఈ కింద పేర్కొన్న మొత్తం బకాయి మరియు దానిపై వడ్డీ, వ్యయాలు మొదలైనవాటి కొరకు వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ బ్రాంచ్ చార్జికి లోబడి వుందునని ప్రత్యేకించి రుణగ్రహీత , హామీదారు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

వ. సం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎకౌంట్ నం.	డిమాండ్ నోటీసు తేదీ మొత్తం బకాయి	ఆస్తి యొక్క వివరాలు	స్వాధీనత రకం & తేదీ
1	షఫీయుల్లా మొమిన్, మైమూన్ బీ ఎం HL0000000011448	24-ఆగస్టు-2024 24-ఆగస్టు-2024 నాటికి రూ.1950667	డి నెం: 17-107/54/2/1 5 నెం: 923 ఆత్మకూరు, యూనియన్ అక్కిరాజు కాలనీ, రహమత్ నగర్ రంగమహల్ టాకీస్ దగ్గర, ఆత్మకూరు, కర్నూలు ఆంధ్రప్రదేశ్-518422. ఇంటి నిర్మిత ప్రదేశం: 661.5 చదరపు అడుగులు. హద్దులు: ఉత్తరం: రాస్తా, దక్షిణం: డి. హుస్సేన్ సాహెబ్ ఇల్లు, తూర్పు : అబ్దుల్ మునాఫ్ ఇల్లు, పడమర: రిజ్వాన్ స్థలం	లాంఛనప్రాయ స్వాధీనత స్వాధీనత తేదీ: 18-జనవరి-2025

తేదీ: 23.01.2025
ప్రదేశము: కర్నూలు
అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

HINDUJA HOUSING FINANCE
హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీస్: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై-600 015,
బ్రాంచ్ కార్యాలయం: 51/12-12-ఇ3, 2వ అంతస్తు, తిలక్‌నగర్, రెవిన్యూ కాలనీ, వార్డ్ నం.51, విద్యుత్ భవన్ ఎదుట, ఆంధ్రాబ్యాంక్ పైన, కర్నూలు-518002.
CIN U65922TN2015PLC10093, www.hindujahousingfinanace.com

అనుబంధం-4 [నిబంధన 8(1)] స్వాధీనత ప్రకటన (స్థిర ఆస్తి కొరకు)

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా.. హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (యాక్ట్ నం.54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002, నిబంధన 3తో చదివే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి నోటీసులో ప్రస్తావించిన బకాయి మొత్తాన్ని సదరు నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసిందిగా కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / హామీదారు(లు) లకు [illegible]

వ. సం.	రుణగ్రహీత(లు)/హామీదారు(లు) పేరు మరియు చిరునామా	బకాయి మొత్తం	డిమాండ్ నోటీసు తేదీ	భౌతిక స్వాధీనత తేదీ
1	[illegible] AP/KUR/KURL/A000000806	14-10-2024 నాటికి రూ.7,93,727/- [illegible]	16/05/2024	21/01/2025

ప్రదేశము : కర్నూలు, తేదీ : 24/01/2025
సం/-అధీకృత అధికారి, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, గురువారం 23, జనవరి 2025

ప్రమాదకరంగా గంజహాల్లి ప్రధాన రహదారి

విశాలాంధ్ర -గోనెగండ్ల: మండల కేంద్రం నుంచి గంజహాల్లి గ్రామానికి ప్రతిరోజూ రాకపోకలు నిర్వహించే ప్రధాన రహదారిపై మురుగునీరు నిలిచి గుంతలుగా ఏర్పడి రోడ్డు అస్తవ్యస్తంగా తయారైందని జనసేన నాయ కులు తెలిపారు. స్థానికులు జనసేన నాయకులకు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం ఆ పార్టీ నాయ కులు గానిగ బాష, మాలిక్, ప్రధాన రహదారిపై నిలిచిన నీటిని రోడ్డుపై ఉన్నా గుంతలను పరిశీలిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ రోడ్డుకు సమీపం లోని కాలని వాసులకు డ్రైనేజీ కాలువ లేక మురుగు నీరు ప్రధాన రహదారిపై నిలిచి పోవడంతో ద్విచక్ర వాహన దారులు రాత్రి వేళల్లో ప్రమాదాల బారిన పడుతు న్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. మార్చి నెలలో మహాత్మా బడేసాహెబ్ తాత ఉరుసు మహెూత్సవం కోసం ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు లక్షల్లో వస్తారనే విషయాన్ని గ్రహించి, గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాలనీ వాసులు డ్రైనేజీ కాలువ లేక ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కోసం ఎమ్మిగనూరు జనసేన పార్టీ ఇంఛార్జి రేఖగౌడ్ సహకారంతో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామన్నారు. జనసేన నాయకులు సుబాన్, ఉత్తేజ్, ఉస్మాన్ పాల్గొన్నారు.

36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు

విశాలాంధ్ర - ఓర్వకల్లు : 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు శుభ సందర్భముగా స్థానిక నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థిని విద్యార్థులకు టోల్ ప్లాజా ఇన్ఫ్రైజ్ కంపెనీ ఆర్ ఈ వి ఎల్ ప్రాజెక్టు వారు టోల్ ప్లాజా సిబ్బంది జాతీయ రోడ్డు భద్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టోల్ ప్లాజా సిబ్బంది, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్, హెడ్ మాస్టర్ ప్రాణేష్ కుమార్, ఆర్ఈవిఎల్ ప్రాజెక్ట్ హెడ్ మదన్ మోహన్ సర్ మాట్లాడుతూ వాహనదారులు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని క్లుప్తంగా వాహనదారులకు వివరించి కొన్ని సూచనలను తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించి నడపరాదని, మొబైల్ ఫోన్ వాడరాదని పాదాచారులకు ముందుగా దాటేటట్లు చూడాలన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించాలని కోరారు. అనంతారం ప్రథమ చికిత్స సీపీఆర్ గురించి స్పష్టంగా వివరించారు. టోల్ ప్లాజా సిబంధి విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేసి మిటాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో టోల్, ప్రాజెక్ట్ హెడ్ మదన్మోహన్, సీనియర్ సేఫ్టీ మేనేజర్ ఖాదర్ వలీ, ఆర్వోఎం నరేశ్వర రెడ్డి, ఆర్వో కుతుబుద్దిన్ బాష, సీనియర్ మేనేజర్ రవి రంజన్, పీఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఇంచార్జీ పారామెడిక్ అబ్దుల్ కలాం, ఆర్పిఓ వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బంది, టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు

గోకుల షెడ్ల నిర్మాణంతో పాడి రైతుల అభివృద్ధి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : గోకులం షెడ్ల నిర్మాణంతో పాడి రైతులు అభివృద్ధి చెందుతారని వైస్ ఎంపీపీ ముత్తమ్మ స్పష్టం చేశారు. బుధవారం మండల పరిధిలోని చిన్న తుంబలం గ్రామంలో నిర్మిస్తున్న మిని గోకులం షెడ్డు నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ ముత్తమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో గోకులం షెడ్ల నిర్మాణంతో పశువుల పెంపకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం పాడి రైతులకు రూ.2 లక్షల వ్యయంతో గోకులం షెడ్డును నిర్మిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యల్లప్ప పాల్గొన్నారు.

రైతన్న డైరీ, రైతు లోకం మాసపత్రిక విడుదల

విశాలాంధ్ర - ఆదోని రూరల్: నూతన సంవత్సర రైతన్న డైరీ, రైతన్న మాస పత్రికలను ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు, బసాపురం గోపాల్ ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు వీరేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, రైతు సంఘం నాయకులు గోరుకల అంజిత్ గౌడ్, భీమన్న, హనుమప్ప పలువురు నాయకులు బుధవారం ఏఐవైఎఫ్ కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి బసాపురం గోపాల్ మాట్లాడుతూ గ్రామాలలో రైతు గడప తిరుగుతూ రైతు సంఘం సభ్యత్వం చేసి రైట్ సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. హర్యానాలోని కానూరి సరిహద్దు వద్ద 52 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు సంఘం నాయకులు జిడ్జిత్ సింగ్ దళేవాల్ కు సంఘీభావంగా అన్ని గ్రామాలు తిరిగి రైతులతో మమేకమై వామపక్ష పార్టీ రైత్సంగాలతో కలిసి ఈ నెలలో 26న సైకిల్ మోటర్లు ట్రాక్టర్లు ర్యాలీతో నిరసన చేపట్టాలని పిలుపునిచ్చారు.

నగరంలో ఆధునిక దుకాణ సముదాయం

- రూ.8 కోట్లు ఖర్చు, 58 దుకాణాలు ఖాళీ
- నగరపాల సంస్థ ఆదాయం బుగ్గిపాలు

విశాలాంధ్ర - జిల్లా పరిషత్ : కర్నూలు నగరపాలక ఆధునిక దుకాణ సముదాయం నిర్మాణానికి 2022 నవంబర్ 4న శ్రీకారం చుట్టారు. నగరపాలక సాధారణ నిధులు రూ.8 కోట్లతో సముదాయాన్ని నిర్మించారు. ఇందులో రెండు బ్లాగులుగా చేసి 58 దుకాణాలను కట్టారు. వాటిని కేటాయించేందుకు రెండుసార్లు వేలం పాట నిర్వహించినా ఆశించిన స్థాయిలో ఎవరు రాలేదు. 2023 డిసెంబర్లో మొదటిసారి 2024 ఫిబ్రవరిలో రెండవసారి వేలం నిర్వహించారు. అధికారులు ఇలా రెండుసార్లు కసరత్తు చేసినా కేవలం 20 దుకాణాలను మాత్రమే దక్కించుకున్నారు. ఇంకా 38 మిగిలిపోయాయి. దుకాణాలను దక్కించుకున్న యజమానులు ఇంకా వాటిని ప్రారంభించ లేదు. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఇటు ప్రజలకు, నగరపాలక సమస్తకు ఎలాంటి ప్రయోజనం చేకూరకపోవడం గమనార్హం. ఈ నిధులతో ప్రజలకు అవసరమయ్యే పనులు చేసినా బాగుండునని నగరవాసులు చర్చించుకుంటున్నారు.

కాలుష్య నివారణకు ప్రత్యేక చర్యలు : ఈఓ

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని శిరివెళ్ల మేజర్ పంచాయతీ గ్రామంలో కాలుష్య నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు గ్రామపంచాయతీ ఈవో అశ్విని కుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ముభారక్ పేటలో ఉన్నటువంటి డ్రైనేజీ మురికి కాలువలో పేరుకు పోయిన చెత్త చెదారం వ్యర్థ పదార్థాల నిలువలను తొలగించి, ఊరికి దూరంగా ఉన్నటువంటి డంపు యార్డ్కు తరలించామన్నారు. డ్రైనేజీ కాలువలలో వ్యర్థ పదార్థాలు చెత్తాచెదారం కవర్లు వేయడం వల్ల మురికి నీరు సరఫరాకు అడ్డంకిగా ఏర్పడి దుర్వాసన వెదజల్లుతూ ఉండగా, ముబారక్ పేట ప్రజలు సర్పంచ్ లక్కాకుల సాలమ్మ చంద్ర, ఈవో అశ్విని కుమార్ దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే స్పందించి కాలుష్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో చేపట్టిన కాలుష్య నివారణ పనుల పట్ల ఒకటవ వార్డు ముబారక్ పేట ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా పేరుకుపోయిన కాలుష్యాన్ని సైతం దగ్గర ఉండి పర్యవేక్షిస్తూ తొలగించి చర్యలను ఈవో చేపట్టడం అభినందించదగ్గ విషయం అన్నారు.

ఘనంగా దేవర ఉత్సవాలు.. హాజరైన ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యే

విషాలాంధ్ర - తుగ్గలి: మండల పరిధిలోని పగిడి రాయి గ్రామంలో బుధవారము గ్రామ దేవతల దేవర ఉత్సవాలను గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహించారు. ఈ దేవరను తిలకించేందుకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ దేవర ఉత్సవాలలో ఎమ్మెల్యేలు కేఈ శ్యామ్ కుమార్, పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవిలతోపాటు టీడీపీ నాయకులు, వైసీపీ నాయకులు హాజరై అమ్మవార్లును దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవర ఉత్సవాలకు హాజరైన నాయ కులకు ఆయా పార్టీ నాయకులు స్వాగతం పలికి ఆహ్వానించారు. పోలీసులు ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా గట్టి బంధాబస్తు నిర్వహించడంతో ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రజలు దేవర ఉత్సవాలలో ఉత్సాహంగా పాల్గొని తమ మొక్కలు తీర్చుకున్నారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీనారాయణ రెడ్డి, మాజీ నీటి సంఘం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి జగన్నాథ్ రెడ్డి, వైసిపి నాయకులు బసిరెడ్డి, సర్పంచ్ సలహాదారుడు బోడిబండ హనుమంతు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాం గౌడ్, ప్రధానో పాధ్యాయులు టీచర్ రామాంజినేయులు,టిడిపి నాయకులు నక్కల దామోదర్, నక్కల రమేష్, ఎర్ర మీసాల సుంకన్న, డీలర్ సుంకన్న, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దబ్బల కృష్ణ మాదిగ పాల్గొన్నారు.

ఉద్యానవనాల నిర్వహణ మెరుగుపడాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో ఉద్యానవనాల నిర్వహణ మరింత మెరుగు పరచాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నేతాజీ నగర్లోని ఉద్యానవనాన్ని, రాంబోట్ల దేవాలయం వద్ద బండు రహదారిని, అవీకర్ సెక్షన్ కాలనీలోని నూతనంగా నిర్మించిన మురుగు కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ఆయా కాలనీ వాసులు ఉద్యానవనాలకు వస్తుంటారని, అధికారులు నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. పిచ్చిమొక్కల తొలగింపు, చిన్నపాటి మరమ్మత్తులు, నిర్మాణాలు, పచ్చదనం పెంపునకు సంబంధించిన పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని ఆదేశించారు. రాజ్ విహార్, వినాయక ఘాట్, ఐదు రహదారుల కూడలి ప్రాంతాల్లో కమిషనర్ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. డీఈఈలు క్రిష్ణలత, గిరిరాజు, ఏఈ భాను ప్రతాప్ పాల్గొన్నారు.

దేశ ప్రజల మనోభావాలు దెబ్బ తీసిన అమిత్ షా

విశాలాంధ్ర - జిల్లా పరిషత్ కర్నూలు : కేంద్రమంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుండి వెంటనే భర్తరఫ్ చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కర్నూలు జిల్లా కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి అంబటి రామకృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో భాగంగా రామకృష్ణ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మార్చేయాలని ఉద్దేశంగా ఉందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల హక్కులను కాలరాయాలను చూస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని రచించిన భారత రాజ్యాంగ పితామహుడు అంబేద్కర్ అని, అలాంటి మహనీయుని అవమానించిన అమీషా ప్రధాని నరేంద్ర మోడీ గారు బర్తరఫ్ చేయకుండా ఇంతకాలం చూస్తూ ఊరుకుంటున్నారన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పి.మురళీ కృష్ణ మాట్లాడుతూ హెూమ్ మంత్రి అమిత్ షా అని, వెంటనే రాజీనామా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, నియోజకవర్గాల కోఆర్డినేటర్లు ఎమ్మిగనూరు ఎం.ఖాసిం వలి, ఆలూరు చిప్పగిరి లక్ష్మీనారాయణ, ఆదోని జి.రమేష్ యాదవ్, పత్తికొండ బి.క్రాంతి నాయుడు, మంత్రాలయం పి.మురళీకృష్ణమ రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అక్షరాభ్యాసంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: నిరక్షరాశులను అక్షరాసులుగా మార్చాలని ఉద్దేశంతో అక్షరాభ్యాసం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో మోహన్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన క్రిష్ణగిరి వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడుతూ అందరూ చదువుకోవాలని ప్రభుత్వాలు ఉచితంగా విద్యను అందిస్తూ రాత్రివేళ వయోజన విద్య ప్రవేశపెట్టి చదువు చెప్పించిన ఘనత లేకపోలేదన్నారు. గ్రామాల్లో 10 మందికి ఒకరు చొప్పున చదువు రాని వారికి ఉచితంగా చదువు నేర్పించాలని చదువు ఉంటేనే సమాజంలో విలువ ఉంటుందని ఆయన గుర్తు చేశారు. దేశం అభివృద్ధి చెందాలంటే చదువు ఎంతో ప్రాముఖ్యమైనదని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే చదువురాని వారిపై ప్రత్యేకత శ్రద్ధ వహించాలని ఆయన అన్నారు. మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న వాటిని వారికి చెప్పాలని ఆయన తెలిపారు. అనంతరం పాఠ్యపుస్తకాలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాధికారి రమణ, వెలుగు ఏ పి ఎం మహేశ్వరయ్య, యల్లప్ప, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

యాదవాడలో పూజలందుకున్న ఉత్సవ పల్లకి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: అహెూబిల లక్ష్మీ నరసింహ స్వామి పారువేట ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. యాదవాడకు చేరుకున్న జ్వాల నరసింహ స్వామి, ప్రహ్లాద వరద స్వాములు కొలువుదీరిన ఉత్సవ పల్లకి బుధవారం యాదవాడ గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ పల్లవి రాకతో గ్రామంలో తిరుణాల వాతావరణం నెలకొంది.

క్లస్టర్ యూనివర్సిటీ డిగ్రీ ఫలితాలు విడుదల

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: క్లస్టర్ యూనివర్సిటీ మూడో సెమిస్టర్ డిగ్రీ ఫలితాలు వైస్ ఛాన్సలర్ ఆచార్య డీవీఆర్ సాయి గోపాల్ బుధవారం విడుదల చేశారు. ఈ పరీక్షలు అక్టోబర్లో నిర్వహించామని, మొత్తం 856 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 574 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె నాగరాజ్ శెట్టి తెలిపారు. 67శాతం శాతం మంది యూనివర్సిటీ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఫిబ్రవరి 3వ తేదీలోగా ఫెయిల్ అయిన విద్యార్థులు రివల్యూషన్‌కు అప్లై చేసుకోవాలని డీన్ తెలిపారు. ఈ సమావేశంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.బాలసుబ్ర మణ్యం, జూనియర్ అసిస్టెంట్ వి.వెంకట రమణయ్యలు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు పరచాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం రాకముందు ఎన్నికలో ఇచ్చినా హామీలను తుంగలోకి తొక్కుతుందిని, ఆ హామీల అమలకై ఉద్యమించాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకులు ఆజాద్ పిలుపునిచ్చారు. అనంతరం కర్నూలు నగరంలో పీడిఎస్‌యూ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికీ విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.3,580 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయకుండా కేవలం ప్రకటనలకు మాత్రం పరిమితం అవుతుంది అన్నారు. తల్లికి వందనం పథకాన్ని ఒక్కొక్క విద్యార్థికి 18 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు గాలికి వదిలేశారన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు రాజేష్, టీయూసీఐ నాయకులు తిరుపల్, రైతు కూలీ సంఘం నాయకులు అర్లప్ప పాల్గొన్నారు.

అహెూబిలంలో ఘనంగా స్వాతి వేడుకలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహెూబిలం లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో లక్ష్మీనరసింహ స్వామి జన్మ నక్షత్రమైన స్వాతి వేడుకలు ఘనంగా జరిగాయి. నల్లమల అరణ్యంలో వెలసిన నవనరసింహులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామున నుండే నవనారసింహులను దర్శించుకు నేందుకు కాలినడకన తరలి వెళ్లారు. కాలినడకన స్వామిని దర్శించు కునే భక్తుల కోసం పావన, వరాహ, అహెూబిల, యోగానంద తదితర క్షేత్రాలలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దిగువ అహెూబిల ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులైన శ్రీ పావన నరసింహ స్వామి, సుదర్శన మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఎదుట సుదర్శన హెూమం వేదమంత్రాలు మధ్య నిర్వహించారు. భక్తులందరికీ కాటుకను, హెూమరక్షలను అందజేశారు. ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రానివ్వకుండా అరికట్టాలి

విశాలాంధ్ర - కృష్ణగిరి: వేసవికాలం సమీపిస్తున్న వేళ గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి రానివ్వకుండా చూడాలని ఎంపీడీవో మోహన్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కృష్ణగిరి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. గ్రామంలో ప్రతి వ్యక్తికి 55 లీటర్ల చొప్పున గ్రామ జనాభానుబట్టి నీరు అందించాలన్నారు. తాగునీటి సమస్య ఎక్కడైనా నెలకొంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. వాటర్ ట్యాంకులను శుభ్రపరచడం, బ్లీచింగ్ పౌడర్ వేయడం, మురికి కాల్వలను శుభ్రపరచడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడవలసిన బాధ్యత ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ హరినాథ్, ఇన్చార్జి ఈఓఆర్డీ లచ్చప్ప, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

క్షీర విప్లవం సృష్టించండి : డాక్టర్ కె.దస్తగిరి

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గల పాడి పరిశ్రమ రైతులు పశు సంవర్ధక శాఖ వైద్యులు, అధికారులు సూచించిన సలహాలను పాటించి క్షీర విప్లవం సృష్టించాలని శిరివెళ్ల ప్రభుత్వ పశు వైద్యాధికారి కె.దస్తగిరి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో బుధవారం పశు ఆరోగ్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దూడలకు, జీవాలకు నట్టల నివారణ మందులను ఆయన పంపిణీ చేశారు జీర్ణకోశ శ్వాసకోశ గర్భకోశ వ్యాధులకు సంబంధించి పలు పశువులకు వైద్య చికిత్సలు అందించి సంరక్షణ పద్ధతులను అవలంబించాలని పాడి పరిశ్రమ యజమానులకు సూచించారు. పాలు ఇచ్చే గేదలు ఆరోగ్యంగా ఉంటూ మంచి పౌష్టిక ఆహారాన్ని దానాలు పచ్చగడ్డిని వేస్తే అధిక పాల దిగుబడితోపాటు వెన్న శాతం వచ్చి మద్దతు ధర లభిస్తుందన్నారు. పాడి పరిశ్రమ రైతులు పశు వైద్య సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం లాభదాయకం

విశాలాంధ్ర - చాగలమర్రి : రైతులు సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి రంగనేతాజీ తెలియజేసారు. బుధవారం మండలంలోని పెద్దవంగలి గ్రామంలో పొలంపి లుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరి, శనగ పంటలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తు సాగు చేస్తున్న లక్ష్మయ్య అనే రైతు పొలమును పరిశీలించారు. ద్రవ జీవామృతం, ఘన జీవామృతం వాటి తయారి గురించి రైతులకు వివరించారు. ప్రస్తుత ఆధునిక కాలంలో నేలను సం రక్షించు కుంటూ ప్రకృతి వ్యవసాయచ సస్యరక్షణ చర్యలు చేపడుతూ తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం పొందడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



విశాలాంధ్ర - కోవెలకుంట్ల: పాడి రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని పశు సంవర్తక శాఖ డైరెక్టర్ డాక్టర్ మాధవరావు పేర్కొన్నారు. బుధవారం కోవెలకుంట్ల మండల పరిధిలోని ఆమడాల గ్రామంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని డైరెక్టర్ మాధవరావు, ఆళ్లగడ్డ పశు సంవర్ధన శాఖ ఉప సంచాలకుల రమణయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులు అభివృద్ధి చేయడానికి అనేక పథకాలు ప్రవేశపెట్టడం తోపాటు ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు వైద్య పరీక్షలు, మందులు, వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. పాడి రైతులు ఈ శిబిరానికి పశువులను తీసుకుని వచ్చి వైద్యం చేయించుకోవాలని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ కాంత్, సిబ్బంది, టిడిపి నాయకుడు రామ్మోహన్ రెడ్డి, మనోహర్, రైతులు పాల్గొన్నారు.

రంగోత్సవం పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా స్థాయి రంగోత్సవం పోటీలు" జిల్లా విద్యా శిక్షణాసంస్థ బి.తాండ్రపాడు, ప్రధానాచార్యులు డా. యన్. అయూబ్ హుసిన్ ప్రారంబించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్ష, ఆంధ్రప్రదేశ్ గారి ఆదేశాల మేరకు ఏర్పాటు కాబడ్డాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా నలుమూలల నుండి 6 నుండి12 తరగతుల విద్యార్థినీ విద్యార్థులు దాదాపు 48 మంది పోటీలో పాల్గొన్నారు. ఇందులో 08 విభాగాల్లో అనగా ఆంధ్రప్రదేశ్ మరియు పంజాబ రాష్ట్రాల గురించి క్విజ్ పోటీ, డ్రాయింగ్ కాపిటీషన్: భారత స్వాతంత్య సమరయోధుల చిత్రాలు, చేతి వ్రాత పోటీ, రంగోలీ పోటీలు, ఆంధ్రప్రదేశ్, పంజాబ్ ఫోక్ డ్యాన్స్ కాంపిటేషన్, డిజిటల్ కొలాజ్ యూనిటీ, ఇంటిగ్రిటీ పొస్టర్, **స్లోగన్ రచనలు :** ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్, రోల్ ప్లే భారతదేశ సంస్కృతి, చరిత్ర మరియు విలువలు విభాగాల్లో నిర్వహించారు. పోటీలో పాల్గొనడానికి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు మరియు వారిని తీసుకు వచ్చిన ఉపాధ్యాయులకు స్నాక్స్, బోజనాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమ వేదిక చాలా అందంగా, సాంప్రదాయ బద్ధంగా తీర్చి దిద్దారు. పోటీల్లో పాల్గొని గెలిచిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఇందులో పాల్గొని మొదటి బహుమతి గెలిచిన వారు తదుపరి రాష్ట్ర స్థాయి, పోటీలలో పాల్గొనడానికి అర్హత పొందుతారు. ఈ కార్యక్రమములో ప్రధానాచార్యుల, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, పంజాల రాష్ట్రాల గురించి క్విజ్ పోటీ జె. శిరీష మొదటి విజేత,యం. షిఫా మహవిసీ రెండవ విజేత, ఎన్.పూజ మూడవ విజేతలుగా నిలిచారు.

డ్రాయింగ్ కాపిటీషన్: భారత స్వాతంత్య సమరయోదుల చిత్రాలు కె.విశాల్ పి.మొహమద్ షఫీ, ఎస్.అరిఫ్ అహముదీ, చెలి వారి పోటీ ఎ.హర్షిత జి. జయత్ర సాయి మీనాక్షి ఎ.జాకి, బాలు లెనిన్ తదితరులు పాల్గొన్నారు.